

శ్రీ ప్రణవపీఠం
ఏలూరు

# ప్రణవ పద్మాకరం

అక్టోబర్ 2024



పాఠకమిత్రులకు

శ్రీ క్రోధి నామ దసరా శుభాకాంక్షలు



ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు

# దసరా శుభాకాంక్షలు



ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

అక్టోబర్ , 2024

# విషయ సూచిక

సంపుటి-3

సంచిక-10


| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 03 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 04 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకలి |
| 05 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 06 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 07 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 09 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 12 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యోనమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




యజ్ఞముల ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (9 రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం

సత్యం వద - ధర్మం చర

ఏలూరు

ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

పూజ్య గురుదేవులు **బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ఆధ్వర్యంలో**

## గోపీ జనుల ద్వారకా ప్రవేశం




శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు

## పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ఆధ్వర్యంలో

## స్వర్ణ సింహాసనము పై శ్రీ మద్భాగవతమును ద్వారకా పట్టణం లో 5000 సంవత్సరముల తర్వాత ఊరేగించారు

**భాగవతమును మొదట కృష్ణుడు శరీరం చాలించిన 30 సంవత్సరాల తర్వాత భాద్రపద శుక్ల నవమి నుండి భాద్రపద పూర్ణిమ వరకు సప్తాహం గా ప్రవచించారు. ఆ తర్వాత 200 సంవత్సరాల తర్వాత ఆషాఢ శుక్లనవమి నుండి పూర్ణిమ వరకు గోకర్ణుడు దుంధుకారునికి చెప్పాడు. ఆ తర్వాత 30 ఏళ్ళ తర్వాత కార్తికశుక్ల నవమి నుండి పూర్ణిమ వరకు సనకసనందనాదులకు నారదుడు చెప్పారని వరాహపురాణం చెపుతున్నది.**

**శ్రీమద్భాగవతం ద్వాదశ స్కంధం ,అధ్యాయం 13, శ్లోకములు 12,13**

**సర్వవేదాంతసారం యద్ బ్రహ్మాత్మైకత్వలక్షణమ్।**

**వస్త్వద్వితీయం తన్నిష్ఠం కైవల్యైకప్రయోజనమ్ ॥ 12**

**ప్రోష్ఠపద్యాం పౌర్ణమాస్యాం హేమసింహసమన్వితమ్।**

**దదాతి యో భాగవతం స యాతి పరమాం గతిమ్ ॥ 13**

పురాణము యొక్క పరమ లక్ష్యము కైవల్య (మోక్ష) ప్రాప్తి, భాద్రపద మాసంలో పూర్ణిమనాడు భాగవత పురాణగ్రంథమును బంగారు సింహాసనము పై ఉంచి పూజించి, దానిని పాత్రులకు దానము చేసిన వారికి పరమ పదం లభిస్తుంది.శ్రీమద్భాగవత పురాణం లో ఉన్న ఈ శ్లోకములను ప్రమాణికముగా తీసుకొని సశాస్త్రీయంగా వేద పండితుల పారాయణం మధ్య, మంగళ వాయిద్యాల మధ్య, కోలాట, నృత్యముల మధ్య, గజరాజును ముందుంచి అభినవ శుకుడు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు అశేష భక్త జనుల మోక్ష ప్రాప్తి కోసమా అన్నట్లు బంగారు సింహాసనం పై భాగవత గ్రంథం ఉంచి, పూజించి ఊరేరిగించారు.ద్వారకా పట్టణంలో కనీ వినీ ఎరుగని రీతిలో శ్రీకృష్ణ స్వామి వారి సంపూర్ణ కటాక్షంతో రుక్మిణీ మాత ఆలయం వరకూ 1000 మందికి పైగా భక్తులు పల్లకీలో బంగారు సింహాసనం ఉంచి, రుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణ స్వామి వారి ఉత్సవ మూర్తుల తో సహా భక్తి శ్రద్ధలతో పూజించారు.రుక్మిణీ దేవికి సారె అందించిన తరువాత ఇలా పూజించిన బంగారు సింహాసనం పై ఉన్న భాగవత గ్రంథరాజాన్ని శ్రీ గురుదేవులకు సమర్పణ భావంతో సమర్పించారు. ప్రదక్షిణలు చేసుకున్నారు. మరొక బ్రహ్మోత్సవమా అన్నట్లు సాగింది ఈ ఉత్సవం.శ్రీ గురుదేవులు మరల అనేక చోట్ల వీలును బట్టి ఈ సింహాసనం ను అంతే అద్భుతంగా , శాస్త్రీయంగా వినియోగించి మరింత మందిని తరింప చేస్తాం అని మంగళ శాసనాలు చేసారు.











# ప్రణవ పద్మాకరం


శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


## సంపాదకీయం

# దుర్గతులను తొలగించే దుర్గ

*"యాదేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా, నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః"*



ప్రాణులందరిలో శక్తిరూపంలో ఉంటుంది 'అమ్మ'. అటువంటి అమ్మ కొఱకు నమస్కారము అని దుర్గా సప్తశతి అమ్మని స్తుతిస్తున్నది. 'యత్ర నార్యస్తు పూజ్యంతే - రమంతే తత్ర దేవతాః అని మనుస్మృతి చెపుతున్నది. స్త్రీలు పూజింపబడే చోట,దేవతలు ఉంటారు అని దీని అర్థం. అనాదిగా మన హిందూధర్మం నమ్మి ఆచరిస్తున్న గొప్ప సూత్రమిది. సనాతన హిందూ సంప్రదాయం స్త్రీకి అత్యున్నత గౌరవాన్ని ఇచ్చింది. తల్లిగా, చెల్లిగా, ఇల్లాలిగా... సమస్త మానవజాతిని మంచి మార్గంలో నడిపేది, నడతను నేర్పేది 'స్త్రీయే' అనే సూత్రాన్నీ సనాతన ధర్మం ఎన్నడూ మరచిపోలేదు. ఏ ప్రాణికైనా జన్మనిచ్చే శక్తి స్త్రీకి మాత్రమే ఉన్నది గనకే స్త్రీ ఆరాధ్య దేవత.. జగన్మాతగా, ఆదిపరాశక్తిగా, ధన-ధాన్య-ధైర్య-సంతానలక్ష్మిగా మనం స్త్రీ జాతిని పూజిస్తున్నాము.' సమాజం మనుగడ, అభివృద్ధి స్త్రీలకు 'గౌరవం' మీద ఆధారపడి ఉంటుంది'. ప్రాచీనకాలం నుండి శాస్త్రాలు సత్యాన్నీ అందిస్తున్నాయి. అందుకనే మాతృమూర్తి అనేక నామాలతో కొలుస్తున్నాము. ఈ జగత్తుకంతా కారణభూతురాలని కీర్తిస్తున్నాము. సర్వచరాచర జగత్తునూ నడిపించేది శక్తి స్వరూపిణి.భారతీయ సనాతన సంప్రదాయంలో ఆశ్వయుజమాసానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. మనలోని చెడును పారద్రోలి మంచిని పెంచడం కోసం అమ్మవారు అవతారస్వరూపిణిగా మానవాళిని అనుగ్రహించినటువంటి మాసం ఇది. ఆశ్వయుజ మాసము లోనే ఇటు దశహరా అటు దీపావళి అనే రెండు పండుగలు కూడా వస్తాయి. వాటిని భారతీయులు అత్యంత ఉత్సాహంతో జరుపుకుంటారు. దేవీనవరాత్రులలో అమ్మవారి ఆలయాలు దివ్య శోభలతో కాంతులీనుతుంటాయి.కనుక దేవీనవరాత్రుల అంతరార్థాన్ని దేవ్యారాధన ప్రాశస్త్యాన్ని గురించి కూడా తెలుసుకోవాలి. నవ అంటే తొమ్మిది. రాత్రి అంటే చీకటి. రాత్రి తమోగుణానికి ప్రతీక. మానవ దేహంలోని తొమ్మిది ద్వారాలు : కళ్ళు, చెవులు, నాసికారంధ్రాలు, నోరు, మలమూత్ర ద్వారాలు. ఈ నవ ద్వారాలు తమోగుణ ఆవరణాలు. దేవిప్రకాశానికి చిహ్నం. తన జ్ఞానతేజస్సుతో నవ ద్వారాలలో ఉన్న తమః సంకేతమైన అజ్ఞానాన్ని పారద్రోలడానికి చేసే సాధనే దేవీనవరాత్రులు నిర్వహించడంలోని అంతరార్థం. అందువల్ల పరాశక్తి ధరించిన వివిధరూపాలను ఆరాధించాలి. దేవ్యుపాసన కారణంగా అజ్ఞానం తొలగుతుంది. జ్ఞానం కలుగుతుంది.దుర్గారాధన వల్ల అసురగుణాలు తొలగిపోతాయి. దివ్యగుణాలు లభిస్తాయి. మానవులు శుద్ధచిత్తులు అవుతారు. "దేవీనవరాత్రులు" సకలసౌభాగ్యాలకు ప్రతీకలు. అందునా 'దుర్గామాత'. దుర్గతులను నిర్మూలించే సర్వశక్తిమయి. ఆ శక్తిని 'భజేద్దుర్గాం స్మరేద్దుర్గాం యాచేద్దుర్గాం శివప్రియాం' అని స్మరించుకొంటూ నేటి సమాజం తాము ఎదుర్కొంటున్న చిక్కులను గురు, దైవ కృపలతో అధిగమించాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.

వద్దిపర్తి పద్మాకర్

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు



# విద్యానిధి

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి దివ్య ఆశీస్సులతో శ్రీ ప్రణవ పీఠం శిష్య బృందం నిర్వహిస్తున్న మహత్తర కార్యక్రమం విద్యానిధి. ఈ కార్యక్రమం ద్వారా వేల సంఖ్యలో ఆస్తికులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా స్తోత్రాలు, పూజా విధానాలు ,ఆసక్తి కలిగి అర్హులైన వారికి వేద సూక్తములు,భాగవత పద్యాలు ,సంగీతం ,హారతి పాటలు, భగవద్గీత వంటివి గురు భక్తులకు నేర్పుతున్నారు.తెలుగు, హిందీ ,సంస్కృత భాషలను,వేద గణితము,జియోగ్రఫీ ,గణితము వంటివి దేశ,విదేశాలలోని పిల్లలకు నేర్పుతున్నారు. ఉపాధికి అవసరమయ్యే అనేక విషయాలను కూడా ఈ కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్నారు

విద్యానిధి Updates కొఱకు క్రింద ఇవ్వబడిన whats app channel ను అనుసరించ గలరు
https://whatsapp.com/channel/0029VaH7mEJK5cD86BWCig40

శ్రీ ప్రణవపీఠం వారి విద్యా నిధి ఏలూరు | శ్రీ ప్రణవపీఠం సత్యం వద - ధర్మం చర ఏలూరు | శ్రీ ప్రణవపీఠం వారి గుడి-బడి ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ గణేశ పురాణం



విశాలమైన మఱ్ఱివృక్షాలు, నానాశాఖోపశాఖలతో, ఊడలతో, పైన నివసిస్తున్న దివ్యపక్షులతో, ఆ పక్షుల మధురధ్వనులతో ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. అక్కడ ఉన్న సరస్సులు అన్నీ మధురమైన అమృతద్రవాలతో నిండి ఉంటాయి. పరశురాముడు కైలాసశోభను తిలకిస్తూ శంకరుని భవనానికి వెళ్ళాడు. ఆ భవనం ఎనిమిది యోజనాల ఎత్తు ఉంటుంది. నాలుగుయోజనాల పొడవు, అంతే వెడల్పుతో చతురస్రాకారంలో, నాలుగు కోణాలతో చాలా అందంగా ఉంటుంది. ఆ భవనద్వారాలన్నీ రత్నాలు తాపడం చేయబడి ఉన్నాయి. అక్కడి వేదికలు, స్తంభాలు సర్వమూ మణిస్థగితాలే . ఆ భవనానికి కుడిప్రక్కన ఒక ఎద్దు ఉంటుంది. ఎడమవైపు సింహముంటుంది. మరొకవైపు నందీశ్వరుడు, మహాకాలుడు, పింగళాక్షుడు, విశాలాక్షుడు, బాణుడు, విరూపాక్షుడు, వికటాక్షుడు, భాస్కరాక్షుడు, రక్తాక్షుడు, వికటోదరుడు, సంహారభైరవుడు, కాలభైరవుడు, రురుభైరవుడు, మహాభైరవుడు, కృష్ణాంగభైరవుడు, క్రోధభైరవుడు, కపాలభైరవుడు, రుద్రభైరవుడు, సిద్ధేంద్రులు, రుద్రగణాలు, విద్యాధరులు, యక్షులు, భూతములు, ప్రేతాలు, పిశాచాలు, కూష్మాండులు, బ్రహ్మరాక్షసులు, భేతాళులు, భక్తులైన దానవులు, జటాజూటధారులైన యోగులు, యక్షులు, కిన్నరులు, కింపురుషులు అందరూ ఆ భవనప్రాంగణంలో పరశురామునికి దర్శనం ఇచ్చారు. వారందరిని పలుకరించి, అనుజ్ఞను తీసుకొని పరశురాముడు భవనంలో ప్రవేశించాడు. శంకరుని ఏకాంతమందిరంలోనికి ప్రవేశించబోతూ పరశురాముడు, అక్కడ ఉన్న శ్రీగణపతిని, కుమారస్వామిని, వీరభద్రుని చూచాడు. వారిని పలుకరించి లోపలికి వెడుతుండగా గణపతి అతడిని ఆపాడు — "భార్గవా! శివుడు యోగనిద్రలో ఉన్నాడు. యోగుల వద్దకు అనుజ్ఞ లేనిదే వెళ్ళరాదని శాస్త్ర నియమం ఉన్నది. నేను వెళ్ళి శివుని స్థితిని గ్రహించి, ఆయన అనుమతి తీసుకొనే దాకా ఇక్కడే ఉండు," అని శ్రీగణేశుడు పలికాడు. అది విన్న భార్గవరాముడు గణేశునితో ఇలా అన్నాడు — "సోదరా! సకల భూతపతి అయిన ఈశ్వరుని, సర్వమాత అయిన పార్వతిని దర్శించి నమస్కరించాలని నా కోరిక. శివానుగ్రహంతో సకల శక్తులనూ పొంది, ఇరవై ఒక్క మార్లు క్షత్రియసంహారం చేసాను. కార్తవీర్యుని, సుచంద్రుని సంహరించాను. దేవదేవుని, మహాదేవుని అనుగ్రహంతో సర్వశాస్త్రాలు, విద్యలూ అభ్యసించి పండితుడినయ్యాను. ఆయన నా గురువే కాదు, జగద్గురువు. ఆయన దర్శనానికి వెళ్ళడానికి శిష్యులకు, భక్తులకు ఎవ్వరి అనుజ్ఞ అవసరంలేదు."

...ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## దానాలు – ఫలితాలు

జలదానం అత్యంత పుణ్యఫలప్రదం. జలం ప్రాణం. జలం విష్ణు నివాసస్థానం. వెంటనే ప్రాణాలు నిలబెట్టే ఉత్తమపదార్థం. అందునా కొండపైకి నడచి వెళ్ళేవారికి అన్ని చోట్లా నీరు దొరకక పోవచ్చును. అటువంటి చోట్ల జలదానం చేయడం కంటె పుణ్యమింకేముంది? స్కాందపురాణంలోని వైష్ణవఖండంలో ఈ జలదానం గూర్చిన విశేషాలున్నాయి.

శ్లోII వేంకటాఖ్యే మహాపుణ్యౌ తృషార్తానాం విశేషతః
జలదానమకుర్వాణః తిర్యగ్యోనిమవాప్నుయాత్ II

(స్కాం.పు.వైష్ణవఖండం.అ.16.శ్లో.1)

మహాపుణ్యస్థలమైన వేంకటాచలంపై బాగా దప్పిక గొన్న వారికి నీటిని ఇవ్వని వారు పశువులుగా, పక్షులుగా జన్మించి అలమటిస్తారు. కాబట్టి తమతమ శక్తిని బట్టి జలదానం చేయాలి. జలదానం హి కర్తవ్యమ్ సర్వేషాం జీవనం మహత్ – అందరికి జలం చాలా అవసరం కనుక జలదానం చేసి తీరాలి. ఒకప్పుడు ఒక బ్రాహ్మణునికి, బల్లికి మధ్యలో జరిగిన సంభాషణ వినిపిస్తాను. విను.

పూర్వం ఇక్ష్వాకువంశంలో హేమాంగుడనే రాజుండేవాడు. బ్రాహ్మణభక్తి కలిగినవాడు. చాలా మంచి వాడు. జితేంద్రియుడు. శత్రుమర్దనుడు. యజ్ఞాలు చేసాడు. గోదానాలు, భూదానాలు, సువర్ణదానాలు, ఇలా ఎన్నో దానాలు చేసాడు. కానీ జలదానం మాత్రం చేయలేదు. వసిష్ఠుడు ఎన్నో సార్లు జలదానం చేయమని రాజునకు సూచించాడు. అప్పుడా హేమాంగదుడు జలదానం కూడా ఒక దానమేనా అని నిర్లక్ష్యం చేసాడు. నీరు ఎక్కడ పడితే అక్కడ దొరుకుతుంది. బంగారం వంటి ధాతువులు, గోవులు, భూములు దొరకవు. కనుక విలువైన వాటిని దానం చేస్తే పుణ్యం తప్ప పనికిమాలిన విలువ లేని జలదానం వ్యర్థం అనేవాడు. జలం ప్రాణస్వరూపమని వశిష్ఠుడు చెప్పినా వినలేదు. ఎక్కడా ఎప్పుడూ ఎవరికీ అంత తేలికగా దొరకని వస్తువులను దానమిస్తేనే పుణ్యమని యుక్తిగా వాదించేవాడు. దానం చేసేటప్పుడు కూడా అవయవలోపాలున్న వారిని, పేదవారిని, ఏపని లేనివారిని ఎంచుకొని దానం చేసేవాడు, చదువుకొన్న వారిని, జ్ఞానులను, గౌరవించి దానాలు చేయలేదు. బాగా చదువుకొన్నవారికి, కీర్తి కలిగినవారికి అందరూ సన్మానాలు చేస్తారు. ధనాలు ఇస్తారు. కాని దిక్కులేనివారికి, విద్యావిహీనులకు, వికలాంగులకు, పేదలకు దానం చేసేవారు ఎవరుంటారు? అని వాదించి తన ధనాన్ని అపాత్రులకు దానం చేసాడు. ఆ దోషం వల్ల శరీరం విడచి మూడు జన్మలు వరుసగా చాతకపక్షిగా జన్మించాడు. ఆ తరవాత జన్మలో మిథిలానగరాన్ని పరిపాలించే శ్రుతకీర్తి ఇంటిలోని గోడపై బల్లిగా పుట్టాడు. గోడలపై, ద్వారాలపై భాగంలో తిరుగుతూ ఈగలు, దోమలు, పురుగులను తింటూ దుర్భరంగా జీవించాడు. 88 సంవత్సరాలు ఈ విధంగా గడిపాడు.

ఇలా ఉండగా ఒకనాడు విదేహరాజైన ఈ శ్రుతకీర్తి ఇంటికి శ్రుతదేవుడనే మహర్షి వేంచేసాడు. అది మాధ్యాహ్నిక వేళ. మహర్షిని చూడగానే రాజు లేచి నిలబడ్డాడు. స్వాగతం పలికి భక్తితో ఆసనమిచ్చి గౌరవించాడు. ఋషి కాళ్ళు కడిగి ఆ నీళ్ళను తన శిరస్సున జల్లుకొని, ఇల్లంతా ఆ నీళ్ళని జల్లించాడు. ఆ నీటిలోని కొన్ని బిందువులు బల్లిపై కూడా పడ్డాయి.

....ఇంకా ఉంది

★★★★★

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## యశోద



శ్రీ మహావిష్ణువు తన అవతారాలలో అనేక సార్లు భూమిలో అవతరించాడు. ఒక్కోసారి అదితి గర్భంలో, మరొకసారి కౌసల్య, దేవకి, మరియు అనసూయ గర్భంలో జన్మించాడు. కానీ ఈ ముల్లోకాలలో దక్కని అదృష్టం మాత్రం తల్లి యశోదకు లభించింది. కృష్ణుడిని పెంచే అపూర్వమైన ఆనందం, ప్రేమ, మమకారం అనుభవించే భాగ్యం యశోదకు మాత్రమే దక్కింది. తల్లి యశోద కృష్ణుడిని చిన్న పిల్లాడిగా చూసి ప్రేమతో పెంచిన విధానం, ఆమె ప్రేమలో ఆప్యాయతతో కూడిన శిక్షలు ఇవ్వడం, రోలుతో కట్టివేయడం వంటి సంఘటనలు ప్రతిసారీ కృష్ణుడిపై ఉన్న తల్లి ప్రేమను చూపిస్తాయి. ఈ ప్రేమను, అనురాగాన్ని పొందే భాగ్యం యశోదకు మాత్రమే దక్కింది. కృష్ణుడు తన బాల్యం నందనవనంలో గడిపినప్పుడు, యశోద తన కొడుకుకు చేసిన సేవలో ఆనందాన్ని పొందింది.కృష్ణుడు యశోదపై ఉన్న ప్రేమను మరింత పెంచడం కోసం, తన ఆటలు, తన మాయలు చూపిస్తూ, తల్లిని మోసగిస్తాడు. అయినా, యశోద తన కుమారుడిని ఒక సాధారణ పిల్లవాడిగా చూసుకుంటూ, అతనిపై ఉన్న ప్రేమను క్షణము కూడా తగ్గించలేదు. దేవతలు, ఋషులు కూడా కృష్ణుడిని ఇలాంటి విధంగా చూసే భాగ్యం పొందలేదు, కానీ యశోద మాత్రం ఆ అదృష్టం పొందింది. యశోద, భగవంతుడికి తన స్తన్యాన్ని ఇచ్చి పోషించిన అనుభూతి, ఆమెకు ఎనలేని ఆనందాన్ని తెచ్చింది. గోకుల గోపికలు కూడా కృష్ణుడిపై ఫిర్యాదు చేసినప్పటికీ, యశోద తన కొడుకును నిందించినా వాటిపై ఎప్పుడూ విశ్వాసం చూపలేదు. కృష్ణుడిపై యశోదకు ఉన్న ప్రేమను దేవతలే కాదు, ఋషులు, గంధర్వులు కూడా ఆశ్చర్యంగా చూసేవారు.నంద - యశోద దంపతులు, సంతానం కోసం తపిస్తూ, తమ ఇంట్లో బిడ్డ పుట్టాలనే ఆశతో ఉన్నారు. చివరికి కృష్ణుడు పుట్టిన తర్వాత, వారు అపారమైన ఆనందాన్ని అనుభవించారు. వారి ఆనందానికి అంతు లేదు. వారు ఎంతో సంతోషంగా ఉన్నారు. యశోద తన బిడ్డను ఎంతో ప్రేమగా, ఆప్యాయతగా పెంచుతూ, అతనిపై అపారమైన ప్రేమ చూపించింది. కృష్ణుడు తన చిన్నతనంలో ఎన్నో వినోదాల్ని, అల్లరిని చూపిస్తూ, తన తల్లి యశోదను ప్రతిసారీ తన మాయలో ముంచెత్తేవాడు. ప్రతి సంఘటన యశోద కళ్ళ ముందు జరిగినప్పుడు, ఆమె కృష్ణుడిని తన కొడుకుగా భావిస్తూ, అతని క్షేమం గురించి ఎల్లప్పుడూ ఆలోచించేది. కృష్ణుడు తన తల్లికి మరింత ఆనందం ఇవ్వాలని అనుకుంటూ, తన సృష్టి మొత్తాన్ని తన నోటిలో చూపించి, ఆమెను ఆశ్చర్యపరిచేవాడు. అయినప్పటికీ, యశోద తన

ఇంకా ఉంది ...

★★★★★

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 336. వింధ్యాచల నివాసినీ [ఓం ఐం హ్రీం శ్రీం వింధ్యాచలనివాసిన్యై నమః]



అచలము అనగా పర్వతము. వింధ్యపర్వతము నందు నివసించునది అని ఈ నామార్థం. పూర్వం మేరువుపై గల ఈర్ష్యతో వింధ్యపర్వతం తన శరీరాన్ని పెంచి సూర్యుని కదలకుండా చేసింది. దానితో లోకాలు స్తంభించాయి. అప్పుడు అగస్త్యుడు, దేవతల ప్రార్థనమంగీకరించి వింధ్య పర్వతాన్ని యథాతథంగా చేసాడు. అప్పుడు వింధ్యం తన స్వరూపాన్ని కోల్పోయి, అవమానం వల్ల దుఃఖించి అమ్మవారిని ప్రార్థించాడు. అమ్మ ప్రత్యక్షమయ్యింది. తన పర్వతప్రాంతంలో అమ్మవారు కొలువైతే తనకు కీర్తి, ముక్తి లభిస్తాయని వింధ్యం అమ్మను ప్రార్థించగా అమ్మ అలాగేనని వరమిచ్చి అక్కడ కొలువయ్యింది. అప్పటి నుండి అమ్మవారిని వింధ్యాచలనివాసిని అన్నారు. మార్కండేయ పురాణంలోని దుర్గాసప్తశతిలో అమ్మవారు పలికిన ఈ శ్లోకాలు ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి.

శ్లో॥వైవస్వతేంఽతరే ప్రాప్తే అష్టావింశతిమే యుగే
శుంభో నిశుంభ శ్చై వాన్యా వుత్పత్స్యేతే మహాసురౌ
నందగోపగృహే జాతా యశోదాగర్భ సంభవా
తతస్తౌ నాశయిష్యామి వింధ్యాచలనివాసినీ ॥
(మా.పు.శ్రీదుర్గాసప్తశతి.అ.11.శ్లో.41,42)

వైవస్వతమన్వంతరంలోని ఇరువది ఎనిమిదవ యుగంలో శుంభనిశుంభులు మరలా పుడతారు. అప్పుడు వారిని సంహరించడానికి నేను నందగృహంలో యశోదాగర్భంలో నుండి జన్మించి, వింధ్యాచలంలో నివాసం ఏర్పాటు చేసుకొని, వారిని నాశనం చేస్తాను, అని అమ్మవారు స్వయంగా దేవతలతో చెప్పింది. ఈ రూపంలోని అమ్మ అత్యంత శక్తిమంతురాలు.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

తీవ్రశత్రువులు, నిత్యం బాధించే దుర్మార్గుల నుండి ఈ మంత్రం రక్షణ కలిగిస్తుంది. సంపదలను ప్రసాదిస్తుంది. పచ్చకర్పూరం, ఏలకులు, కుంకుమపువ్వు కలిపిన నీరు ఒక చిన్న పాత్రలో పోసి, అమ్మకు నివేదించి, అనంతరం ఈ మంత్రాన్ని దినమునకు 1000 సార్లు జపించి జపం పూర్తి అయ్యాక, అమ్మకు నివేదించిన ఆ కర్పూర జలాన్ని తీర్థంగా [కొంచెం] త్రాగితే ఎటువంటి శత్రువులైనా నశిస్తారు. సంపదలు లభిస్తాయి. మోకాళ్ళ నొప్పులు, వాయు బాధలు [గ్యాస్ ట్రబుల్] నశిస్తాయి.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఋషి చరిత్ర

## మరీచి మహర్షి

మరీచి మహర్షి (మరీచి అనగా ఒక కాంతి పుంజము) బ్రహ్మ మానసపుత్రులలో ఒక్కరు అని చెప్పబడినది. మొదటి మన్వంతరములోని ఏడుగురు బ్రహ్మ మానసపుత్రులలో మరీచి ఒక్కరు. మిగిలినవారు అత్రి, అంగీరుడు, పులహు, క్రతు, పులస్త్యుడు, వశిష్టుడు. వేరొక కథనము ప్రకారము మరీచి బ్రహ్మదేవుడు సృష్టించిన పదిమంది ప్రజాపతులలో ఒక్కడు మరీచి.స్వాయంభు మన్వంతరంలో ఉన్న సప్తఋషులలో అనగా మరీచి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగీరుడు, అత్రి మరియు వశిష్ఠులు వీరిని బ్రహ్మపుత్రులుగా భావించబడ్డ మరీచితో పాటుగా ఇతరుల యొక్క సప్తఋషులందరి పేరు కూడా ౨౦ మంది ప్రజాపతులలో లెక్క వేయబడింది. వేదములలోనే కాక పురాణములలో కూడా సప్తర్షుల ప్రస్తావన ఉన్నది. కర్మకాండకు మరీచి ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చినట్టుగా చెప్పబడినది. సంపూర్ణ సంఘ పరిత్యాగము ద్వారా కాక కర్మల ద్వారా యోగసాధనను మరీచి మహర్షి సమర్థించినారు. మరీచికి ఉన్న సంతానములో కశ్యపమహర్షి అగ్రగణ్యులు. అలాగే ధర్మవ్రత మరీచి యొక్క భార్యలలో పేరెన్నికగన్నది. ఒక సందర్భములో ఆమె మహర్షి కోపానికి గురై రాతిగా రూపాంతరము చెందినది. అప్పుడు ఆమె తన తప్పు లేదని మునీశ్వరున్ని ప్రార్థించి తనను తాను అగ్నికి ఆహుతి కావించుకొన్నది. శ్రీమహావిష్ణువు ఆమె భక్తికి ప్రసన్నుడై ఆమెను శాపవిముక్తురాలిని చేయబోగా ఆమె వారించి తనను ఇప్పటినుండి దేవశిలగా ప్రతి ఒక్క ఇంటిలో పూజలందుకొనే విధముగా చేయమని ప్రార్థించింది. ఆమె భక్తికి మెచ్చి విష్ణువు ఆ వరమును ప్రసాదించినాడని ఒక కథనము. ముఖ్యంగా ఆయన కుమారుడైన కశ్యపమహర్షి వల్ల మరీచి మహర్షి కళ అను యువతిని పెండ్లియాడి కళ వల్ల కశ్యపునికి శ్రీమహావిష్ణువు అంశగా జన్మనిచ్చినాడు. (కశ్యప మహర్షి తన తండ్రినుండి ప్రజాపతిత్వాన్ని కూడా పొందినట్టు చెప్పబడినది ). బ్రహ్మదేవుడు పుష్కరంలో జరిగినటువంటి గొప్ప యజ్ఞంలో మహర్షి మరీచిని “అచ్చావాక్” అనేటువంటి పదవిలో నియమించాడని, అంతేకాకుండా పదివేల శ్లోకాలతో కూడిన బ్రహ్మపురాణాన్ని దానంగా మొట్టమొదటగా బ్రహ్మదేవుడు మరీచికే ఇచ్చాడని ప్రశశ్తి. ద్వాపరయుగములో మహాభారత కాలములో భీష్మునికి అంపశయ్య మీదనుండగా దర్శనమిచ్చినట్టు కూడా చెప్పబడినది. బ్రహ్మాండపురాణము తదితర పురాణములలో మరీచి ప్రస్తావన ఉన్నది. కృతయుగమునందు ధృవునికి తపస్సు చేయమని సలహా ఇచ్చినవాడు మరీచి. మరీచి గొప్ప జ్ఞాని, బ్రహ్మ మానసపుత్రునిగా పురాణాలలో చిత్రీకరించబడింది.



★★★★★

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం



ఎవరైతే కాశీ కాశీ కాశీ అని మూడుసార్లు భక్తితో పలుకుతారో అట్టి వారిని మించిన భక్తుడు మరొకరు ఉండరు.కాశీని ఎవరైతే ధ్యానించి సేవిస్తారో వారు నన్ను తలుచుకొని నాకు సేవ చేసినట్టే.ఎవరి హృదయం సర్వదా కాశీని సేవిస్తుందో వారిని నా హృదయంలో ఉంచుకుంటాను. ఇతరుల సహాయముతో కాశీలో ఉన్న వారు కూడా నాకు అత్యంత ప్రీతిపాత్రులు అని శివుడు కాశీ యొక్క మహిమను తలుచుకున్నాడు(శివుడు లోకానికి కాశీ మహిమ తెలియజేయటానికి ఈ విధంగా తలుచున్నాడు). ఈ విధముగా కాశీ మహత్తును తలుచుకున్న శివుడు మిగిలిన ప్రమథ గణములను కూడా పిలిచాడు.మిగిలిన ప్రమథ గణములను కూడా కాశీకి వెళ్ళమని ఆజ్ఞ ఇచ్చాడు.కాశీకి పంపడానికి ముందు శివుడు వారితో ఈ విధముగా చెప్పెను.పవిత్ర హృదయులారా కాశీలో దివోదాసు శాసనము నడుస్తున్నది,ఆ కాశీకి మీరందరూ కూడా వెళ్లండి. ఓ తిలపర్ణ, స్థూలకర్ణ,దుమిచండ,ప్రభామయ, సుకేశ,విందతే,ఛాగ, కపర్ధి, పింగళాక్ష, వీరభద్ర,కిరాత, చతుర్ముఖ, నికుంభ, పంచాక్ష,భారభూత,త్ర్యక్ష,క్షేమక,లాంగలి,విరాధ,సుముఖ,ఆషాఢ మీరందరూ ఇప్పుడే కాశీకి వెళ్లండి అక్కడి పాలనలో లోపములను తెలియజేయండి".శివుని పలుకు విన్న శివగణములు అందరూ కాశీకి ప్రయాణమయ్యారు, మాయారూపము ధరించి వీరందరూ ఏకాగ్రచిత్తులై దివోదాసునియొక్క పాలనలో ధర్మ లోపములను కలిగించటానికి, ధర్మ లోపాలను కనిపెట్టడానికి తీవ్రమైన ప్రయత్నం చేసారు, అనేక రూపములు ధరించారు.ఎంత చేసినప్పటికీ ఎన్ని వేషాలు వేసినప్పటికీ దివోదాసు పాలనలో చిన్న లోపమును కూడా కనిపెట్టలేకపోయారు.అక్కడి ప్రజల్లో, ఆయన పాలనలో ఎలాంటి లోపం కనిపించలేదు. వీరందరు కూడాను దీర్ఘకాలం కాశీలో ఉండి కూడా ఏమీ చేయలేకపోయారు.వీరంతా ఇలా అనుకున్నారు "ఆహా! ఎంత గొప్పని ప్రదేశం ఈ కాశీ".మనం ఇన్ని దినములనుండి ఇక్కడ ఉన్నప్పటికీ ఏ విధమైనటువంటి ఉపయోగం లేకుండా పోయింది. స్వామి కార్యాన్ని పూర్తి చేయకుండా స్వామికి మనం ముఖం చూపించినట్లయితే మనం ఈ ప్రపంచంలో అత్యంత సిగ్గులేని నీచులుగా మిగిలి విశ్వానికి భారమవుతాము.స్వామికి కార్యం పూర్తి చేయకుండా మన ముఖం ఎలా చూపించగలుగుతాం అని భావించారు.మనం పురాణములను కూడా విని ఉన్నాం, పురాణములలో కాశీ మహత్తు చాలా గొప్పగా వివరించబడింది.ఎటువంటి పాపులైనా కాశీని ఆశ్రయిస్తే వారికి అన్ని సద్గతులు లభించడమే కాకుండా పాపములు నశిస్తాయి,శివుని యొక్క కృప నేరుగా ఉంటుంది. అందువల్ల మనం ఈ కాశీలో ఉండిపోవడం తప్ప..

.. ఇంకా ఉంది

★★★★★

# స్తోత్రమాలిక

## శ్రీ లక్ష్మ్యష్టోత్తర శతనామస్తోత్రమ్



ఫలశ్రుతి: సకల సంపదలు కావాలంటే, అనేక జన్మలలో మనం చేసిన పాపముల వలన లభించిన దారిద్ర్యం తొలగాలంటే, తత్ క్షణం లక్ష్మీకటాక్షం లభించాలంటే శ్రీ లక్ష్మీదేవికి సంబంధించిన అష్టోత్తరశతనామ స్తోత్రాన్ని భక్తితో పారాయణం చేయాలి లేదా వినాలి.

వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం హస్తాభ్యామభయప్రదాం మణిగణైర్నానావిధైర్భూషితామ్ |

భక్తాభీష్టఫలప్రదాం హరిహరబ్రహ్మాదిభిస్సేవితాం పార్శ్వే పంకజశంఖపద్మ నిధిభిర్యుక్తాం సదా శక్తిభిః || 1 ||

సరసిజనయనే! సరోజహస్తే! ధవళతరాంశుక గంధమాల్యశోభే! |

భగవతి! హరివల్లభే! మనోజ్ఞే! త్రిభువనభూతికరి! ప్రసీదమహ్యామ్ || ౨ ||

ప్రకృతిం వికృతిం విద్యాం సర్వభూతహితప్రదామ్ |

శ్రద్ధాం విభూతిం సురభిం నమామి పరమాత్మికామ్ || 3 ||

వాచం పద్మాలయాం పద్మాం శుచిం స్వాహాం స్వధాం సుధామ్ |

ధన్యాం హిరణ్మయీం లక్ష్మీం నిత్యపుష్టాం విభావరీమ్ || 4 ||

అదితిం చ దితిం దీప్తాం వసుధాం వసుధారిణీమ్ |

నమామి కమలాం కాంతాం క్షమాం క్షీరోదసంభవామ్ ‖ 5 ‖

అనుగ్రహపరాం బుద్ధిం అనఘాం హరివల్లభామ్ |

అశోకామమృతాం దీప్తాం లోకశోకవినాశినీమ్ ‖6‖

నమామి  ధర్మనిలయాం కరుణాం లోకమాతరమ్ |

పద్మప్రియాం పద్మహస్తాం పద్మాక్షీం పద్మసుందరీమ్ ‖ 7 ‖

పద్మోద్భవాం పద్మముఖీం పద్మనాభప్రియాం రమామ్ |

పద్మమాలాధరాం దేవీం పద్మినీం పద్మగంధినీమ్ ‖ 8 ‖

పుణ్యగంధాం సుప్రసన్నాం ప్రసాదాభిముఖీం ప్రభామ్ |

నమామి చంద్రవదనాం చంద్రాం చంద్రసహోదరీమ్ ‖ 9 ‖

చతుర్భుజాం చంద్రరూపామ్ ఇందిరామిందుశీతలామ్ |

ఆహ్లాదజననీం పుష్టిం శివాం శివకరీం సతీమ్ ‖ 10 ‖

విమలాం విశ్వజననీం తుష్టిం దారిద్ర్యనాశినీమ్ ‖

ప్రీతిపుష్కరిణీం శాంతాం శుక్లమాల్యాంబరాం శ్రియమ్ ‖ 11 ‖

భాస్కరీం బిల్వనిలయాం వరారోహాం యశస్వినీమ్ ‖

వసుంధరాముదారాంగాం హరిణీం హేమమాలినీమ్ ‖ 12 ‖

ధనధాన్యకరీం సిద్ధిం స్త్రైణసౌమ్యాం శుభప్రదామ్ |

నృపవేశ్మగతానందాం వరలక్ష్మీం వసుప్రదామ్ ‖ 13 ‖

శుభాం హిరణ్యప్రాకారాం సముద్రతనయాం జయామ్ |

నమామి మంగళాం దేవీం విష్ణువక్షఃస్థలస్థితామ్ ‖ 14 ‖

విష్ణుపత్నీం ప్రసన్నాక్షీం నారాయణసమాశ్రితామ్ |

దారిద్ర్యధ్వంసినీం దేవీం సర్వోపద్రవవారిణీమ్ ॥ 15 ॥

నవదుర్గాం మహాలక్ష్మీం బ్రహ్మరుద్రేంద్రసేవితామ్ |

త్రికాలజ్ఞానసంపన్నాం నమామి భువనేశ్వరీమ్ ॥ 16 ॥

లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం

దాసీభూత సమస్తదేవ వనితాం లోకైకదీపాంకురామ్ |

శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం

త్వాం త్రైలోక్య  కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్ ॥ 17 ॥

మాతర్నమామి కమలే! కమలాయతాక్షి! శ్రీవిష్ణుహృత్కమలవాసిని! విశ్వమాతః! |

క్షీరోదజే! కమలకోమల గర్భగౌరి! లక్ష్మి! ప్రసీద సతతం నమతాం శరణ్యే! ॥ 18 ॥

త్రికాలం యో జపేద్విద్వాన్ షణ్మాసం విజితేంద్రియః |

దారిద్ర్యధ్వంసనం కృత్వా శ్రియమాప్నోత్యయత్నతః ॥ 19 ॥

దేవీ నామసహస్రేషు పుణ్యమష్టోత్తరం శతమ్

భృగువారే శతం ధీమాన్ పఠేద్వత్సర మాత్రకమ్ ॥ 20 ॥

అష్టైశ్వర్యమవాప్నోతి కుబేర ఇవ భూతలే |

దారిద్ర్యమోచనం నామ స్తోత్రమంబాపరం శతమ్ ॥ 21 ॥

యేన శ్రియమవాప్నోతి కోటిజన్మ దరిద్రతః |

భుక్త్వాతు విపులాన్ భోగాన్ అంతే సాయుజ్యమాప్నుయాత్ ॥ 22 ॥

ప్రాతఃకాలే పఠేన్నిత్యం సర్వదుఃఖోపశాంతయే పఠంస్తు చింతయేద్దేవీం సర్వాభరణభూషితామ్ ॥ 23 ॥

★★★★★

# గురుదేవుల జీవన కవనము

## ద్వావింశతి అధ్యాయః



1200కు పైగా అష్టావధానాలు,ఇరవైకి పైగా శతావధానాలు నిర్వహించారు. ప్రస్తుతం భారతదేశంలో త్రిభాషా మహా సహస్రావధాని ఒక్క బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారే అనడంలో ఎంత మాత్రం ఆలోచించవలసిన పనిలేదు.సప్తఖండ అవధాన ఝరి పేరుతో ఆసియ, ఆఫ్రికా యూరోపు, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా వంటి అన్ని ఖండములలో అంతర్జాలములో జూమ్ మాధ్యమం ద్వారా అనేక అష్టావధానాలు నిర్వహించారు. సింగపూర్,మలేషియా,అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇంగ్లాండ్ వంటి దేశములలో శతావధానములు కూడా చేసారు పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు.మహిళలతో ప్రత్యేకంగా నిర్వహించిన శతావధానం అద్భుతమైన ఘట్టం. కేవలం పండితులతోనే కాకుండా భవిష్యత్తు తరాలకు కూడా సాహిత్యం పై ఆసక్తిని పెంచి అవధానులుగా తీర్చిదిద్దే క్రమంలో పిల్లలతో కూడా అవధానం నిర్వహించారు. శతావధానంలో వారిధారణకు సాటి మరొకరు లేరు, రారు.ఊరు ఏదైనా, ప్రాంతం ఏదైనా,దేశం ఏదైనా తెలుగు భాషకు పట్టం కట్టడానికి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ముందు ఉంటారు. వారి సాహితీ ప్రతిభ గురించి వర్ణించటం ,ధారణా ప్రతిభ గురించి వర్ణించటం సామాన్య వ్యక్తులకు సాధ్యపడదు. చిన్నారులను కూడా సాహిత్య మార్గంలో నడిపించి వారిని అవధానులుగా తీర్చిదిద్దారు. శ్రీ గురువుగారి పద్యములలో భక్తి మాత్రమే కాదు హాస్యం, చతురత కూడా ఉంటుంది.తెలుగు భాష పట్ల సంపూర్ణ పాండిత్యం ఉన్న వారు అరుదుగా ఉంటారు, వారిలో బ్రహ్మశ్రీ పద్మాకర్ గారు అగ్రగణ్యులు.

....ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

శ్రీ ప్రణవపీఠం వారి

# గుడి-బడి

ఏలూరు

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

